
# ఆస్కార్ బరిలో 'లాపతా లేడీస్'



2025 ఆస్కార్‌కు మన దేశం నుంచి 'లాపతా లేడీస్' సినిమా అధికారికంగా ఎంపికైంది. ఉత్తమ విదేశీ చిత్ర కేటగిరిలో భారత్ నుంచి ఎంట్రీ దక్కించుకుంది. బాలీవుడ్ అగ్రనటుడు ఆమిర్‌ఖాన్ మాజీ సతీమణి కిరణ్‌రావు ఈ బాలీవుడ్ చిత్రానికి డైరెక్టర్. ఆమిర్‌ఖాన్ నిర్మాత. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ ఇందులో ప్రధాన భూమికలు పోషించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకోవడంతో పాటు బాక్సాఫీస్ పరంగా కూడా విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ సినిమా ఆస్కార్‌కి ఎంపిక అవుతుందని ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ కిరణ్‌రావు జోస్యం చెప్పారు. '2015 ఆస్కార్ అవార్డుల్లో మన దేశం తరపున అధికారిక ప్రవేశానికి 'లాపతా లేడీస్' అర్హత సాధిస్తుందని పూర్తి విశ్వాసంతో ఉన్నాను. ఈ సినిమా ఆస్కార్ వేదికపై మనదేశానికి ప్రాతినిధ్యం వహిచాలని మా టీమ్ ఆకాంక్ష' అంటూ ఆ ఇంటర్వ్యూలో తెలిపారు కిరణ్‌రావు. ఆమె అన్నట్టే ఈ సినిమా ఆస్కార్‌కు ఎంపికైంది. ఇక 'లాపతా లేడీస్' కథ విషయానికొస్తే.. 2001లో సాగే కథ ఇది. పల్లె ప్రాంతానికి చెందిన ఇద్దరు పెళ్లికూతుళ్లు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారు అవుతారు. ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అనేదే ఈ చిత్ర కథ. భారతీయ సమాజంలో కట్టుబాట్ల పేరుతో మహిళల స్వేచ్ఛను హరిస్తున్న తీరుని, వారి ఆకాంక్షలను అణచివేస్తున్న ధోరణిని సందేశాత్మకంగా ఈ చిత్రంలో ఆవిష్కరించారు. ఓ వైపు నవ్విస్తూనే మరోవైపు సీరియస్ అంశాలను చర్చకు తీసుకొచ్చింది చిత్రం. పెళ్లి చేసుకొని అత్తారింట్లో సేవలు చేయడానికి మాత్రమే మహిళలు ఉన్నారని, వారికి ఎలాంటి వ్యక్తిగత ఇష్టాలు ఉండవనే ఆలోచనల్లో మార్పు రావాలని దర్శకురాలు కిరణ్‌రావ్ ఈ సినిమా ద్వారా తెలియజెప్పారు. ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేలా ఈ సినిమాను రూపొందించారు. గతేడాది ప్రతిష్టాత్మ టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే సుప్రీంకోర్ట్ 75ఏళ్ల వేడుకలో కూడా ప్రదర్శించారు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో జరిగిన 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' అవార్డుల్లోనూ క్రిటిక్స్ విభాగంలో 'లాపతా లేడీస్' ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకోవడం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.



# మార్చిలో వీరమల్లు ఆగమనం

**రాజకీయాల్లో** బిజీ అయిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ నిచ్చారు అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్. ఏపీ ఉపముఖ్యమంత్రిగా పాలనాపరమైన వ్యవహారాల్లో తీరికలేకుండా ఉండటం వల్ల ఆయన సినిమాల షూటింగ్స్ అన్నీ నిలిచిపోయాయి. అయితే పవన్‌కల్యాణ్ అభిమానులకు ఓ శుభవార్తను అందించింది 'హరిహరవీరమల్లు' చిత్ర బృందం. సోమవారం ఈ సినిమా షూటింగ్‌ను విజయవాడలో పునః ప్రారంభించినట్లు పేర్కొంది. ఇందులో పవన్‌కల్యాణ్‌తో పాటు చిత్ర తారాగణమంతా పాల్గొన్నారు. ఈ షెడ్యూల్‌లో హాలీవుడ్ యాక్షన్ దర్శకుడు నిక్‌పావెల్ పర్యవేక్షణలో భారీ యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నారు. కళా దర్శకుడు తోట తరణి నేతృత్వంలో ఓ భారీ సెట్‌ను తీర్చిదిద్దారు. 400 మంది ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులతో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. మొఘల్ సామ్రాజ్య నేపథ్య ఇతివృత్తంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. 'హరిహర వీరమల్లు పార్ట్-1స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ను వచ్చే ఏడాది మార్చి 28న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. బాబీ డియోల్, అనుపమ్‌ఖేర్, నాజర్, రఘుబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాణ సంస్థ: మెగా సూర్య ప్రొడక్షన్స్, నిర్మాత: ఏ.దయాకర్ రావు, సమర్పణ: ఏం.ఎం.రత్నం, దర్శకత్వం: జ్యోతికృష్ణ.



## మంచి స్ట్రెస్ బస్టర్

అయిదేళ్ల క్రితం వచ్చి విజయం సాధించిన 'మత్తువదలరా' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మత్తువదలరా 2'. శ్రీసింహా కోడూరి, సత్య, ఫారియా అబ్దుల్లా లీడ్ రోల్స్ చేసిన ఈ చిత్రానికి రితేష్ రానా దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై చిరంజీవి(చెర్రి), హేమలత పెదమల్లు నిర్మించిన ఈచిత్రం ఈ నెల 13న విడుదలై థియేటర్లలో ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్‌మీట్‌లో హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'మా సినిమాను అనుకున్నదానికంటే పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. పార్ట్ 3 కోసం మీలాగే నేనూ ఎదురుచూస్తున్నా.' అన్నారు. ఈ సినిమాను ఒక మంచి స్ట్రెస్ బస్టర్ అని చాలామంది అంటున్నారని నిర్మాత తెలిపారు. 'ప్రపంచవ్యాప్తంగా 30కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిందీ సినిమా. దసరా సెలవల్లోనూ ఈ రన్ కంటిన్యూ అవుతుందని నమ్ముతున్నాం. ఇదే ఉత్సాహంతో 'మత్తువదలరా 3' బ్రహ్మాండంగా చేస్తాం' అని నిర్మాత వై.రవిశంకర్ తెలిపారు.

## స్త్రీ-3 కోసం ఎదురుచూస్తున్నా



''స్త్రీ-2'నా కెరీర్‌కి ఊహించని వరం. ఈ స్థాయి విజయాన్ని నేనెన్నడూ ఊహించలేదు. ఖాన్ సినిమాలకు వచ్చే కలెక్షన్లు కథానాయిక నేపథ్య చిత్రానికి రావడం నిజంగా ఆశ్చర్యం. ప్రస్తుతానికి దేశంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆరోస్థానంలో 'స్త్రీ-2' ఉంది. ఇంకా వసూళ్లు బాగానే ఉన్నాయని, ఈ లెక్కలు కూడా మారే ఛాన్సుందని చెబుతున్నారు.' అంటూ ఆనందం వెలిబుచ్చింది శ్రద్ధా కపూర్. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం ''స్త్రీ -2'. 2018లో వచ్చిన హిట్ సినిమా 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌కుమార్‌రావ్ కీలకపాత్ర పోషించిన ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకుడు. ఆగస్ట్ 15న విడుదలైన ఈ సినిమా 39రోజుల్లో 604కోట్ల షేర్, 713కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. తాజా ఇంటర్వ్యూలో ఈ విజయం గురించి శ్రద్ధా ఆసక్తికరంగా మాట్లాడింది. 'పెద్ద స్టార్లు లేకపోయినా కథను ఆసక్తికరంగా చెబితే జనం ఆదరిస్తారని 'స్త్రీ 2'తో రుజువైంది. ఈ ఫ్రాంచైజీ కొనసాగుతూనే ఉండాలని కోరుకుంటున్నా. 'స్త్రీ 3'కోసం నేనూ ఈగర్లీ ఎదురుచూస్తున్నా.' అని చెప్పుకొచ్చింది శ్రద్ధా.

# ఎన్నో ప్రశ్నలకు సమాధానమిస్తుంది!

'సత్యం సుందరం' సినిమా స్క్రిప్ట్ చదివినప్పుడు తనకు ఓ జీవితం కనిపించిందని, కె.విశ్వనాథ్‌గారి సినిమాల తరహాలో మన సంస్కృతి, మన మూలాలను తరచి చూపిస్తుందని చెప్పారు అగ్ర హీరో కార్తీ. అరవింద్ స్వామితో కలిసి ఆయన నటించిన 'సత్యం సుందరం' ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సూర్య, జ్యోతిక నిర్మించారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా సోమవారం హీరో కార్తీ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న సంగతులు..



- దర్శకుడు ప్రేమ్‌కుమార్ ఈ సినిమా స్క్రిప్ట్‌ను ఓ నవల తరహాలో రాశారు. స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు చాలా చోట్ల ఆనందంతో కన్నీళ్లొచ్చాయి. నాకు కె.విశ్వనాథ్‌గారి సినిమాలంటే చాలా ఇష్టం. ఇప్పుడు అలాంటి కథలు రావడం లేదు. ఈ కథ చదివినప్పుడు విశ్వనాథ్‌గారి సినిమా అనుభూతినిచ్చింది. మన జీవితంలోని చాలా ప్రశ్నలకు సమాధానమిస్తుంది. అన్నయ్య సూర్యకి కూడా ఈ కథ బాగా నచ్చింది.
- అన్నదమ్ముల్లాంటి ఇద్దరు వ్యక్తుల మధ్య కథ నడుస్తుంది. ఎలాంటి షరతులులేని నిస్వార్థమైన ప్రేమ మనకు కేవలం కుటుంబంలోనే దొరుకుతుంది. అలాంటి అన్‌కండీషనల్ లవ్‌ను ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. మన సంస్కృతి, మూలాలను పట్టి చూపిస్తుంది. కథలో వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయి. ఇందులో నేను ఓ పల్లెటూరిలో చీరల దుకాణం నడిపే అమాయకమైన వ్యక్తిగా కనిపిస్తా. ఎలాంటి కోరికలు లేకుండా జీవితాన్ని సరదాగా గడుపుతుంటాను.
- కథ మొత్తం ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. 'సాగరసంగమం' సినిమా చూసినప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో..అదే తరహాలో ప్రేక్షకులు సినిమాను ఆస్వాదిస్తారు. అరవింద్‌స్వామి కథ చదివి చాలా ఎమోషనల్ అయ్యారు. తన నిజ జీవితంలో కూడా ఈ తరహా కథ జరిగిందని చెప్పారు. మా ఇద్దరి క్యారెక్టర్స్ మధ్య మంచి ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది.
- ఈ సినిమాలో సంభాషణలు కూడా చాలా సహజంగా ఉంటాయి. తెరపై ఓ జీవితాన్ని చూస్తున్న అనుభూతినిస్తుంది. గోవింద్ వసంత్ అద్భుతమైన సంగీతాన్నందించారు. ప్రతీ పాట చక్కటి అర్థంతో సందర్భానుసారంగా వస్తుంది. అన్నయ్య ఈ సినిమా నిర్మాణ వ్యవహారాలను మాత్రమే చూసుకున్నారు. క్రియేటివ్ సైడ్ ఆయన ఇన్‌వాల్వ్‌మెంట ఏమాత్రం లేదు. అన్నయ్య నా తొలి సినిమా చూసి గట్టిగా హత్తుకొని మెచ్చుకున్నారు. మళ్లీ చాలా ఏండ్ల తర్వాత ఈ సినిమాకు అదే రీతిలో స్పందించారు. అద్భుతంగా పర్‌ఫార్మ్ చేశావని అభినందించారు. ప్రస్తుతం నేను నటిస్తున్న 'సర్దార్-2' చిత్రీకరణ జరుగుతున్నది. 'వా వాతియారే' సినిమా కూడా పైప్‌లైన్‌లో ఉంది. 'ఖైదీ-2' వచ్చే ఏడాది ఉండే అవకాశం ఉంది.

## తూగుతున్న తూనీగల్లా..



సదన్, ప్రియాంకప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ సినిమా నుంచి 'చూడకయ్యో..నెమలి కళ్ల తూగుతున్న తూనీగల్లా..' అనే పాటను ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ పాటకు చక్కటి సాహిత్యం కుదిరిందని, బాణీ ఆకట్టుకునేలా ఉందని, జానపద శైలితో అందరినీ మెప్పిస్తుందని అన్నారు. మార్కండేయ రచించిన ఈ గీతాన్ని సాయిచరణ్, సునీత ఆలపించారు. సాయికుమార్, పృథ్వీ, జబర్దస్త్ రాజమౌళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ, దర్శకత్వం: పీఎల్ విఘ్నేష్.

## 'దేవర' స్పెషల్‌షోస్‌కు అనుమతి

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కించిన 'దేవర' చిత్రం ఈ నెల 27 ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సినిమా స్పెషల్‌షోస్ ప్రదర్శనతో పాటు టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. తొలి రోజు అర్ధరాత్రి 1గంటకు స్పెషల్‌షోతో పాటు అన్ని థియేటర్లలో ఉదయం 4 గంటల నుంచి ఆరుషోలు ప్రదర్శించుకునేందుకు అనుమతినిచ్చింది. ఇక స్పెషల్‌షోస్‌కు టికెట్ ధరను వంద రూపాయలు పెంచుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 6 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ 25, మల్టీప్లెక్స్‌ల్లో రూ 50 పెంచుకునేందుకు అవకాశం కల్పించింది.



## వినూత్న కథతో 'మిస్టర్ సెలబ్రిటీ'

సుదర్శన్ పరుచూరి హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. చందిన రవికిషోర్ దర్శకుడు. చిన్న రెడ్డయ్య, పాండురంగారావు నిర్మాతలు. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ సినిమాలోని 'నీ జతగా..' అంటూ సాగే మెలోడీ గీతాన్ని అగ్ర హీరో గోపీచంద్ విడుదల చేశారు. వినోద్ యాజమాన్య సంగీతాన్నందించిన ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ ఆలపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన గోపీచంద్.. పరుచూరి వెంకటేశ్వర్రావు గారి మనవడు హీరోగా నటిస్తున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. వినూత్నమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, నేటి యువతరం మెచ్చే అన్ని అంశాలుంటాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, రచన-దర్శకత్వం: చందిని రవికిషోర్.



## సంక్రాంతి చిన్నోడి మజాకా

రవితేజతో బ్లాక్‌బాస్టర్ 'ధమాకా' అందించిన దర్శకుడు త్రినాథరావు నక్కిన.. ఇప్పుడు సందీప్‌కిషన్‌తో 'మజాకా' చేస్తున్నారు. రాజేష్ దండా నిర్మాత. సంక్రాంతికి సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా టైటిల్, రిలీజ్ టైమ్‌తో కూడిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సందీప్‌కిషన్ పర్ఫెక్ట్ సంక్రాంతి చిన్నోడిగా కనిపించారు. సంప్రదాయ పంచెకట్టు, చొక్కా ధరించి, భుజంపై పెద్ద టేప్‌రికార్డర్‌తో కుర్చీపై కూర్చొని ఎంటర్టైన్మెంట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. రావు రమేశ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: లియోన్ జేమ్స్, సహనిర్మాత: బాలాజీ గుత్తా, నిర్మాణం: ఏకే ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్.

